క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

శ్మశానవాటిక మార్గానికి మోక్షం



మంత్రి కాకాణి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎస్టీలు

పొదలకూరు : పట్టణంలోని గ్రామికనగర్(పూ కోటి రామయ్యనగర్) గిరిజన కాలనీ వాసులు శ్మశానవాటికకు దశాబ్దాలుగా దారి లేక ఇబ్బందులు పడేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించి దారి సమస్యను పరిష్కరించారు. నిధులను మంజూరు చేయించి నిర్మాణ పనులను కూడా పూర్తి చేశారు. దీంతో స్థానిక గిరిజనులు గురువారం కాలనీలో మంత్రి కాకాణి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించిన మంత్రి కాకాణికి జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లడించారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు మద్దిరెడ్డి రమణారెడ్డి, సోమా భాస్కరరావు, పెంచలయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

భద్రతలో ఎస్‌ఈఐఎల్ ఆదర్శవంతం

తోటపల్లిగూడూరు : భద్రతా ప్రమాణాల విషయంలో ఎస్‌ఈఐఎల్ ఇతరులకు ఆదర్శవంతంగా నిలుస్తోందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అనంతపురంలో ఉన్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) కార్యాలయంలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ విజయానికి అత్యంత ప్రధానమైన భద్రతపై ఎస్‌ఈఐఎల్ ప్రత్యేక శ్రద్ధ చూపడం హర్షణీయమన్నారు. ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాల కల్పనకు గుర్తింపుగా ఇండస్ట్రీయల్ సేఫ్టీ ఎక్సలెన్స్ 2023 వేడుకల్లో ఎస్‌ఈఐఎల్‌కు అవార్డు దక్కడం సముచితమన్నారు. అనంతరం కంపెనీలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో కంపెనీ సీఈఓ శ్రీరాఘవ్ త్రివేది, ఓఅండ్‌ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా, హెచ్‌ఎస్‌ఈ హెడ్ పవన్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

వెంకటాచలం : మోటార్ బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నిడిగుంటపాళెం సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ముత్తుకూరు మండలం పిడతాపోలూరు గ్రామానికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు(27) బైక్‌పై పనినిమిత్తం గుడ్లూరువారిపాళెం పంచాయతీ మొలకలపూడి వెళ్లాడు. తిరిగి పిడతాపోలూరు వెళ్తుండగా నిడిగుంటపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ అంకమరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పొట్టి శ్రీరాములు జయంతి

నెల్లూరు(దర్గామిట్ట): అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆరోజు ఉదయం పది గంటలకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేసి ఓట్లడిగే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ప్రజలు ఆదరించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి నిధులు రూ.7 లక్షలతో ఆర్వోప్లాంట్, మునులపూడి, రెడ్డిపాళెం గ్రామాల్లో రూ.కోటి 19 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, రూ.40 లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు శ్రీరామరక్ష అన్నారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో భాగంగా మండలంలో 4,597 మంది లబ్ధిదారులకు రూ.8.61 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. పేద ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ నాయకులకన్నా ప్రజలు చైతన్యం కలవారని, నిత్యం ప్రజల్లో ఉండే నాయకులనే ఆదరిస్తారని వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉన్నామన్నారు. కరోనా కష్టకాలంలో టీడీపీ నాయకులు కనీసం ప్రజలకు కనిపించలేదని, ప్రస్తుతం ఎన్నికలు ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. వారి మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. ఆయా కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టౌన్, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కె.మధుసూదన్‌రెడ్డి, మునులపూడి సర్పంచ్ వెంకటరమణారెడ్డి, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



వెంకటాచలం : పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి



మనుబోలు : మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

వెంకటాచలం : పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. మండలంలోని కసుమూరు పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని గదులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలోని అన్ని గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విధుల్లో ఎవరూ అలసత్వం చూపరాదని సూచించారు. క్షయ, లెప్రసీ బాధితులను గుర్తించి, మందులను పంపిణీ చేసి త్వరితగతిన వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి అర్షియ, సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు

మనుబోలు : క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణాధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని, ఎఫ్‌పీసీ కేంద్రాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహిసినా సుల్తానా, గేయ పూజిత, సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ వెంకటరమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మనుబోలు : పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దయాకర్

గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించాలి

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి సక్రమంగా వైద్యసేవలు అందించాలని నెల్లూరు డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఎలా అమలవుతుందో నేరుగా వెళ్లి తెలుసుకుంటున్నట్లు వివరించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట డాక్టర్ గేయపూజిత, సీహెచ్‌ఓ రాజయ్య వున్నారు.

ఘనంగా సరస్వతి పూజ



ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో..

ముత్తుకూరు : పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ప్రకటన వెలువడడంతో జెడ్పీ హైస్కూళ్లలో పరీక్షల వాతావరణం నెలకొంది. టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు మొదలయ్యాయి. చదువుల తల్లి సరస్వతీదేవికి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి గురువారం పూజలు ఆచరించారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు పూజలో పాల్గొన్నారు. విగ్రహం వద్ద పుస్తకాలు ఉంచి పూజలు చేశారు. టెన్త్ విద్యార్థులు 93 మందితో పాటు ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో..

పొదలకూరు : స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీదేవి విగ్రహాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం జ్యోతి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థినులు పరీక్షలు చక్కగా రాసి ఉన్నత మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ పులి సురేఖ, వార్డు సభ్యుడు కండే వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నేలటూరుకు మంత్రి కాకాణి రాక నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం నేలటూరు పట్టపుపాళేనికి వస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బర్‌ను మంత్రి పరిశీలిస్తారని వెల్లడించారు.

నేడు పొదలకూరులో ఆరోగ్య సురక్ష

పొదలకూరు : పట్టణంలోని బిట్-1 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు గురువారం తెలిపారు. నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

నియామక పత్రం అందజేత



మౌనికకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని ఇస్కపాళెం గ్రామం కొత్తకాలనీకి చెందిన బెల్లంకొండ మౌనిక అంగన్‌వాడీ కార్యకర్తగా ఎంపికైంది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ఆమెకు గురువారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమ్‌సాగర్‌రెడ్డి సేవలు మరువలేనివి



ప్రతిభ చూపిన విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అతిథులు

వెంకటాచలం: ఎస్‌ఆర్‌ఐ డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి సేవలు మరువలేనివని హెచ్‌ఎం సీహెచ్ చలపతి కొనియాడారు. మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ గురువారం నిర్వహించారు. అనంతరం 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షల నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐ ప్రేమ్‌సాగర్‌రెడ్డి తన స్వగ్రామంతో పాటు చదివిన పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషి చాలా గొప్పదన్నారు. ఎక్కడో అమెరికాలో స్థిరపడినా జన్మభూమిపై మమకారంతో నిడిగుంటపాళెం గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు పోటీతత్వంతో చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు రవినాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటరమణయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ముత్తుకూరు : మండలంలోని ఈపూరు శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ముత్తుకూరు ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి పోలీసు సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లతో పాటు వారి నుంచి రూ.13,000లు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు



ఇంటి పటాను అందజేస్తున్న నాయకులు

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందినట్లు రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు పొందిన 325 మంది లబ్ధిదారులకు కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని, దీంతో పాటు పింఛన్లు పొందేందుకు గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంటి వద్దకే పింఛన్లు సైతం అందుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల ఏఎంసీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సర్పంచ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారిణికి సన్మానం

కోవూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్‌ఎం ఇందిరాదేవి తెలిపారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పులిగొండ్ల దీక్ష ఇటీవల జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించారు. ఈ మేరకు పాఠశాల ప్రాంగణంలో దీక్షను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆమె మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, పీఈటీ అజయ్ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేలా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌రావు రూ.5 వేలు, స్థానికులు సుధాకర్ రూ.3 వేలు, శ్రీనివాసులు రూ.2 వేలు ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం



మనుబోలు : ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మనుబోలు మండల కేంద్రంలోని కేఆర్‌పురంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం ప్రజలకు వివరించారు. గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి భాస్కర్‌గౌడ్, గిద్దంటి రమణయ్య, సయ్యద్ రఫీ, దేశిరెడ్డి హరనాథ్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, దాసరి మహేంద్రవర్మ, తుపాకుల గిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గతంలో, ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని నగర పంచాయతీ పరిధి 15వ వార్డు కౌన్సిలర్ అనంతమ్మ అన్నారు. ఈ మేరకు తన వార్డు పరిధిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఇందుకూరుపేట : జగదేవిపేటలో గర్భిణులు, బాలింతలతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్



కొడవలూరు : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కొడవలూరు : పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, బరువు తక్కువగా ఉన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇవ్వడం ద్వారా పిల్లలు బరువు పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. పిల్లలు జన్మించిన వెంటనే ముర్రుపాలు విధిగా తాగించాలని చెప్పారు. తద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రధానంగా గర్భిణులు రక్తహీనతకు దూరం కావాలంటే పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వై.సుమతి, మహిళా పోలీసు వై.సురేఖ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇందుకూరుపేట : గర్భిణులు, బాలింతలు, పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని జగదేవిపేటలో పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీరామాంజనేయులు

కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిబంధనలు తప్పక పాటించాలని ఎంపీడీఓ శ్రీరామాంజనేయులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నిబంధనల అమలు జరగాలన్నారు. అదేవిధంగా పంచాయతీ అభివృద్ధికి సంబంధించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ నాగూర్‌వలి పంచాయతీల వారీగా ప్రగతిపై సమీక్షించారు.